# ఆంధ్రలక్ష్మి

- కీర్తిశేషులు శ్రీ ఎ.వి.ఎస్. రామారావు.



**(ఆంధ్రప్రదేశ్ అవతరణ సందర్భములో రామారావుగారి కలమునుండి జాలువారిన కవిత)**

గీ. వీరశౌర్యాల జూపించి విసిగి విసిగి,
నిరశనవ్రత దీక్షల నెఱపి నెఱపి,
పెక్కురను గుండ్లకున్బలి వెట్టి, తుదకు
నిలచి తెచ్చిన నాలుగు నెలల పంట.

గీ. దిశలు దేదీప్యమానమై తేజరిల్ల
రయమునను వచ్చెనదె యాంధ్రరాష్ట్రలక్ష్మి
వరుస ముక్కోటి యాంధ్రుల వాంఛితమ్ము
లెమ్ము! సోదర! యాహ్వానమిమ్మువేగ.

సీ. పేరూరు పండితుల్వేనోళ్ళ బాడుచు
స్వస్థివాచకములు సల్పుచుండ;
ఘన, కూచిపూడి భాగవతులు ముదమొప్ప
వరనాట్యప్రగతి నాహ్వానమిడగ;
పొందూరు నుప్పాడ పొల్నారు జల్తారు
పట్టుపుట్టంబులు బహుమతులిడ;
గోదావరీ సాధ్వి కోహినూర్వజ్రాల
గాన్కల నొసగుచు గారవింప;

గీ. వీణ, తబలా మృదంగాది వివిధ శబ్ద
ముల, ఫిడేలు కర్ణానందమును ఘటింప,
తగ విశాఖపట్టణము దంతపుభరిణల
బహుమతులనిడ, వచ్చె సౌభాగ్యలక్ష్మి;

సీ. దేహకాంతి మెఱపు తీవయైవెలుగొంద
పట్టు పీతాంబరాల్గట్టి, నుదుట
కస్తూరి తిలకంబు ఘుమఘుమల్వెదజల్ల
మంచి గంధము మేళవించి మేన,
కమనీయ నవరత్నఖచితమౌ హారముల్
కంఠమందున నలంకరణజేసి
సొబగైన వజ్రాలశోభతో నలరారి
ముదము గొల్పు కిరీటమును ధరించి,

గీ. చూడుమల్లదె రధమున సొంపునింప
రత్న సింహాసనంబున రాజ్ఞివోలె
వచ్చుచున్నది రాష్ట్ర సౌభాగ్యలక్ష్మి
స్వాగతంబిమ్ము ఆంధ్రుడా! సత్వరంబు.

గీ. ఆంధ్ర సౌభాగ్యరేఖ శ్రీయాంధ్రమాత
హారతులగొని యాంధ్ర సింహాసనంబు
పైన గూర్చుండి సర్వసౌభాగ్యగరిమ
దీవనలనిచ్చి కావుత తెలుగువారి.

(ఆంధ్రప్రదేశ్ అవతరణ (నవంబరు 1) సందర్భముగా).



**రచయిత గురించి ...**

కీర్తిశేషులు శ్రీ ఏ. వి. ఎస్. రామారావు గారు విశాఖపట్టణములోని మిసెస్. ఎ. వి. యన్. కాలేజీ ఉన్నత పాఠశాల తెలుగు పండితులుగా (1966 నుండి 1976 వరకు) వృత్తిని సాగిస్తూ, వ్యవసాయము చేయడము, జోతిష్యం, కవితలు, కథలు, నాటికలు, నాటకములు వ్రాయడం వంటి వివిధ ప్రక్రియలలో వారి ప్రతిభను కనబరిచారు. ఆయన రాసిన శ్రీమత్కందరామాయణము (కంద పద్యములతో), మహాభారతము (సీస పద్యములతో) ఈనాటివరకు వెలుగు చూడలేదు. వాటి ప్రచురణకు సన్నాహాలు జరుగుతున్నాయి. 1930 అక్టోబరు 4 న జన్మించిన ఈయన 1976 జులై 16 న స్వర్గస్థులయ్యారు.